క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ నగర సంకీర్తన



నాదెండ్ల: గణపవరం గ్రామంలోని శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారికి జ్యోతి, నగర సంకీర్తన కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. శాంతి నగర్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భక్తులు ఇరుముడులు ధరించారు. ఈ నెల 4న కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో ఉన్న లక్ష్మీతిరుపతమ్మ గ్రామానికి వెళ్లి ఇరుముడులు ధరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

జూదరుల అరెస్ట్



ఈపూరు : పేకాట ఆడుతున్న వారిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని బోడెపూడివారిపాలెం సమీపంలోని పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.28,990లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు చెప్పారు.

నూరుశాతం ఫలితాలు లక్ష్యం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రారంభించిన బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రీ - ఫైనల్ పూర్తి కావటంతో ఫలితాలు ఆధారంగా విద్యార్థినులను గ్రేడ్‌లుగా విభజించి, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మార్చి 1 నుంచి ఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం సబ్జెక్టులు వారీగా తరగతులు తీసుకుంటున్నారు. ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్ష సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలు, దస్తూరి తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పరీక్ష ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

పండిట్ దీన్ దయాళ్ చిత్రపటానికి ఘన నివాళి



నరసరావుపేట ఈస్ట్: జన సంఘ్ వ్యవస్థాపకులలో ఒకరైన పండిట్ దీన్ దయాళ్ పుణ్యతిథిని పురస్కరించుకొని ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో బరంపేటలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సమర్పణ దివస్ నిర్వహించారు. దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ, పార్లమెంట్ సంయోజక్ చిరుమామిళ్ల ఆదినారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి కామినేని హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు వీరమళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు దుస్తుల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆరు పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం అందజేశారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేసి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, రామ్మోహనాచార్యులు, నారాయణ, ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం



చిలకలూరిపేట: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న జ్వాలాముఖి పోలేరమ్మ తల్లి దేవాలయ తృతీయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంతో ప్రజా మన్ననలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- గుంటుపాలెంలో ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలు ప్రారంభం



ఆర్బీకే భవన శిలాఫలకం ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కార దిశగా చర్యలు చేపట్టిన వారందరూ సమాజంలో ప్రజల మన్ననలు పొందుతారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఆదివారం గుంటుపాలెం గ్రామంలో రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవన సముదాయాలను ఆయన ప్రారంభించారు. బహిరంగ సభలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వినుకొండ ముఖ చిత్రాన్ని మార్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం ఖాయమని, రాష్ట్ర ప్రజలందరూ ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపివేస్తారన్నారు. ఆడుపడుచులకు చీరలు పంపిణీ చేస్తుంటే బురిడీబాబు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు రాజకీయం చేయటం సిగ్గుచేటన్నారు. రైతు భరోసా, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ స్థల దాతలు మన్నెపల్లి సుబ్బారావు-అంజమ్మ, (8 సెంట్లు) పురేటి శ్రీనివాసరావు (వలంటీరు)- సంధ్య (5 సెంట్లు) దంపతులతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావును ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల కో-ఆప్షన్ సభ్యుడు దూదెకుల హుస్సేన్, ఎంపీడీఓ కొర్రపాటి కవితా చౌదరి, ఏవో ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు,సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గతంలో వినుకొండ తాగునీటి సమస్యను ఆసరాగా తీసుకొని నీళ్ల ట్యాంకుల పేరుతో కోట్లాది రూపాయల మున్సిపల్ నిధులను టీడీపీ నాయకులు కొల్లగొట్టారని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు విమర్శించారు. సింగర చెరువు 270 ఎకరాలు అందుబాటులోకి తీసుకొచ్చి ప్రతిరోజూ తాగునీరు ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

వినుకొండ(నూజెండ్ల): శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామం నుంచి 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శావల్యాపురం ఎంపీపీ ముండ్లమూరి సుహాసినీ అనీల్‌కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



శిలా మండపం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

మహంకాళి ఆలయ శిలా మండపానికి పూజలు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ప్రదక్షిణ మండపాన్ని శిలలతో ఏర్పాటు పనులను ఆయన ప్రారంభించారు. క్రిష్ణశిలతో తయారు చేసిన ఉపపీఠం, కుంభమాంద్యాధి స్తంభం వద్ద పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొత్త సాంబశివరావు, సభ్యులు కాకుమాను వెంకట బదరీ నారాయణ, బూసా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయపాటి ప్రసాద్, అల్లూరి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నిడమానూరి సురేంద్ర రూ.5లక్షలు, ఉపాధ్యక్షుడు ఆత్మకూరి రాజేంద్రప్రసాద్ రూ.2.50లక్షలు, కూరపాటి వెంకట అమరలింగేశ్వరరావు రూ.2.5లక్షలు విరాళం అందజేశారు. అత్యంత అద్భుతంగా శిల్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పునర్నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే గోపిరెడ్డి తెలిపారు. ఈవో టి.సుధాకరరెడ్డి, దామోదరరెడ్డి, మాలపాటి తిరుపతిరెడ్డి, పిచ్చయ్య మేస్త్రీ ఉన్నారు.

కమ్యూనిటీ హాలు ప్రారంభం

నరసరావుపేట రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పెదరెడ్డిపాలెంలో ఎస్టీ కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన శనివారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వెంకటప్పారెడ్డి, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వర్లు, భవనం సుధాకరరెడ్డి, భవనం కృష్ణారెడ్డి, యేరువ శివారెడ్డి, తాడిమళ్ల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులో ఉన్న చారిత్రాత్మక శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక అలంకరణగావించి, మండపారాధన నిర్వహించారు. నవగ్రహ పూజలు నిర్వహించి లక్ష్మీగణపతి హోమం, మహన్యాసకపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయంలో.. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు ఎడ్లబండ్లతో పూజలు నిర్వహించి ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రభలు తరలించి, పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పిస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయని రైతుల ప్రగాఢ విశ్వాసం. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి హోమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సంతర్పణలో భక్తులకు భోజనం వడ్డించారు. పూజారి ఇర్లపాటి సురేష్ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. దేవాదాయశాఖ ఈఓ ఎస్.తులసిదాస్, సిబ్బంది, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పురుషోత్తమపట్నం ప్రభకు పూజలు

చిలకలూరిపేట: కోటప్పకొండ తిరునాళ్లలో విద్యుత్ ప్రభలదే వైభవమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. కోటప్పకొండ తిరునాళ్లకు పురుషోత్తమపట్నం గ్రామంలో నిర్మిస్తున్న చిన్నతోటవారి ప్రభ వద్ద మల్లెల రాజేష్‌నాయుడు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభల నిర్మాణం భక్తిభావంతో పాటు గ్రామస్తుల్లో ఐక్యమత్య భావాన్ని పెంపొందిస్తుందన్నారు. ప్రభల నిర్మాణం పురుషోత్తమపట్నంకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో తోట మాధవరావు, తోట లక్ష్మీనారాయణ(చినకాపు), తోట కోటి సూర్యనారాయణ, తోట చినబాబు, తోట శేషగిరి, తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

మాచర్ల: ఆర్యవైశ్యుల ఇలవేల్పు, ఆదిపరాశక్తి శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారు ఆర్యవైశ్యుల కోసం ఆత్మార్పణ చేసిన రోజు శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధ్యక్షులు ఆత్మకూరి పూర్ణచంద్రరావు, అర్చకులు శ్రీనివాసశర్మ, దత్తుల ఆధ్వర్యంలో ఘనంగా అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 102 గోత్రాల కన్యలచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ప్రధాన రహదారిలోని కోదండ రామాలయం నుంచి 102 బిందెలతో అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. అనంతరం దేవాలయంలో పూజలు చేశారు. ఆర్యవైశ్య పెద్దలు, కమిటీ సభ్యులు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో పలువురు చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడా వెంకట లక్ష్మి, సెక్రటరీ చుండూరు సత్యనారాయణ, వాసవి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కంభంపాటి అనిల్‌కుమార్, భవనారి వెంకటేశ్వర్లు, పరిటాల ధనలక్ష్మి, తిరివీధి శిరీష పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని షున్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల, లైమ్ సిటీ, శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారి సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం జరిగింది. ఈ శిబిరానికి సుమారు 350 మంది హాజరయ్యారు. వారిలో 200 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరముందని, వీరందరికి శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని వారిచే ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి కన్వీనర్లుగా గర్నె సుబ్రహ్మణ్యం, కాకుమాను శ్రీనివాసరావులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ అధ్యక్షులు ఎ.గురవయ్య, సెక్రటరీ కొత్త రవి, ట్రెజరర్ జె.బ్రహ్మం, రోటరీ సీనియర్ సభ్యులు తాటా సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, జూలకంటి సుబ్రహ్మణ్యం, గుండా అశోక్, ఏచూరి రాధాకృష్ణ, పీవీ నరసింహారావు, అమీర్ అలీ, వైద్యులు హాజరయ్యారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



శావల్యాపురం: ఇర్లపాడు గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రచార కమిటీ ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద ఆచరణలు ఇంటింటికీ తిరగి ప్రచారం చేశారు. మాఘ మాసంలో సగుణ, నిర్గుణ పూజల విశేషాలను తెలియజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు వీరాంజనేయులు, చిర్రా వెంకట్రామిరెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

భద్రతతో కూడిన ప్రయాణం క్షేమం

దాచేపల్లి : భద్రతతో కూడిన ప్రయాణం క్షేమకరమని సీఐ ఎ.సురేంద్రబాబు అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు దాచేపల్లిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సురేంద్రబాబు మాట్లాడుతూ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో భద్రత చర్యలు చేపట్టాలని, భద్రత లేకుండా ప్రయాణం చేసి ప్రమాదాలబారిన పడవద్దని చెప్పారు. ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసే సమయాల్లో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి, ఏఎస్‌ఐ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కొండవీడును సందర్శించిన విద్యార్థులు

పిడుగురాళ్ల: విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర విజయవంతంగా జరిగిందని పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.స్వామి తెలిపారు. పాఠశాలలోని 4, 5 తరగతులు చదువుతున్న 30 మంది విద్యార్థులతో పల్నాడు జిల్లాలోని చారిత్రక కొండవీడు ప్రదేశాన్ని సందర్శించి కొండవీడు అందాలను తిలకించి ఆటపాటలతో విద్యార్థులు గడిపారని తెలిపారు. విద్యార్థులకు కొండవీడు ప్రాముఖ్యత గురించి వివరించటం జరిగిందన్నారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చింతా రామకృష్ణ విద్యార్థులకు రవాణా, భోజన సదుపాయాలను కల్పించటం అభినందనీయమన్నారు. విజ్ఞాన విహార యాత్రలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్య సహాయ మాత వేడుకలు

మాచర్ల: పట్టణంలోని లక్షల రూపాయలతో నిర్మించిన నిత్య సహాయ మాత దేవాలయ ప్రతిష్ఠ, 58వ మహోత్సవాల సందర్భంగా ఆదివారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని రెవ.ఫాదర్ కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి నిర్వహించారు. అందులో భాగంగా ముందుగా పవిత్ర దివ్య పూజాబలి, వాక్యోపదేశము నిత్య సహాయ మహోత్సవ కార్యక్రమాన్ని జరిపి పతాక ఆవిష్కరణ జరిపారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.సుందరరాజు, జె.మర్రెడ్డి, కిరీటిరెడ్డి, ఎ.ప్రకాష్, తుమ్మా మర్రెడ్డి, లక్ష్మయ్యతో పాటు సెయింటాన్స్ సంస్థలకు చెందిన హెచ్‌ఎంలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దాడి ఘటనలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: దాడి ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. అర్బన్ పోలీసులు వివరాల మేరకు.. పట్టణంలోని సుగాలి కాలనీకి చెందిన సురేష్ నాయక్ (40) బావమరిది రవితేజా, స్నేహితులు వేణు, భీమా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్‌తో కలసి పట్టణంలోని సింగ్‌నగర్ ప్రభుత్వ వైన్స్ వద్ద మద్యం సేవించటానికి వెళ్లారు. పాత కక్షల నేపథ్యంలో వెంకటేశ్వర్లు నాయక్ నాపరాయితో సురేష్‌నాయక్ తలపై కొట్టాడు. ఈ దాడిలో సురేష్‌నాయక్‌కు గాయాలయ్యి స్పృహ కోల్పోయాడు. స్నేహితుల సహాయంతో భార్య శ్రావణిబాయి సురేష్‌నాయక్‌ను పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లింది. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం సురేష్‌నాయక్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వబ్రాహ్మణులకు రాజకీయ అవకాశం కల్పించాలి


ఒక్క రోజు నిరాహారదీక్షలో విశ్వబ్రాహ్మణ సంఘీయులు



నిరాహారదీక్షకు హాజరైన విశ్వబ్రాహ్మణ సంఘీయులు

నరసరావుపేట: రాష్ట్రంలో 20 లక్షలకు పైగా జనాభా కలిగిన విశ్వబ్రాహ్మణులను జాతీయ, ప్రాంతీయ ప్రధాన పార్టీలు గుర్తించి, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు చేకూరి రామస్వామి కోరారు. ఆదివారం స్థానిక శివుడు బొమ్మ సెంటర్లో పల్నాడు జిల్లా విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు సుతారం వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు నిరాహార దీక్షలో ముఖ్య అతిథిగా రామస్వామి పాల్గొన్నారు. విశ్వకర్మ, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాలకు పూలమాలతో నమస్కరించి, దీక్షలో కూర్చున్న సభ్యులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా రాజకీయ పార్టీలు విశ్వబ్రాహ్మణులను ఓట్ బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. విశ్వబ్రాహ్మణులు లేనిదే విశ్వంబు లేదురా అని ప్రతి పల్లె, ఇంట్లో అవసరమైన పంచ వృత్తులను చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. అలాంటి తమకు ఆర్థికంగా వెనుకబాటు తనం పోవాలంటే రాజకీయాలలో తగిన ప్రాధాన్యం కావాలని, అందుకు ప్రధాన పార్టీలు తమకు స్థానం కల్పించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి, మాజీ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ భీమవరపు నీరజ, ఓబీసీ ఆల్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లోజు ప్రసాద్, జిల్లా సెక్రటరీ బొప్పూడి సాయిప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు సైదాచారి, గౌరవ సలహాదారులు పామర్తి కోటేశ్వరరావు, కోశాధికారి వేములూరు రాంబాబు, రాష్ట్ర కార్పెంటర్ యూనియన్ ఉపాధ్యక్షుడు సిద్ధి కృష్ణమాచారి, యూత్ ప్రెసిడెంట్ అంగాలకుదిపి గోపీ, యువజన సెక్రటరీ నీసరగండు బ్రహ్మనందం పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరీ ఆలయ వార్షికోత్సవాలు



రొంపిచర్ల : రొంపిచర్లలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ 22వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. , మహిళలు, ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరావు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో నగర సంకీర్తన

సత్తెనపల్లి: పట్టణంలోని నాలుగు బజార్లలో నగర సంకీర్తన బృందం ఆదివారం పర్యటించింది. దేవుడి ఫొటోను చేత పట్టుకొని కోలాట ప్రదర్శనగా పట్టణంలోని గీతా మందిరం నుంచి ఉదయం ఐదు గంటలకు బేడబుడగ జంగాల కాలనీకి వెళ్లి అక్కడ లక్ష్మీతిరుపతమ్మ గుడి దగ్గర, అక్కడి నుంచి నాలుగు బజార్లు నగర సంకీర్తన చేశారు. ఈ బృందంలో 51 మంది సభ్యులు పాల్గొన్నారు.

మల్లెల రాజేష్ నాయుడికే మా మద్దతు

కాపు జేఏసీ నాయకుల పిలుపు



అభివాదం చేస్తున్న కాపు జేఏసీ నాయకులు

చిలకలూరిపేటటౌన్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు విజయానికి కృషి చేస్తామని కాపు జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని ఈగల్ రెస్టారెంట్ సమావేశ మందిరంలో కాపు జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకులు గోవిందు శంకర శ్రీనివాస్, మల్లెల శివనాగేశ్వరరావు, తిమ్మశెట్టి కోటేశ్వరరావు, ఇర్రి రాఘవ తదితరులు ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాపు సామాజిక వర్గానికి చెందిన వారిని పార్టీలకు అతీతంగా ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఇందులో భాగంగానే చిలకలూరిపేటలో మల్లెల రాజేష్‌నాయుడుకు మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఇదే విషయమై నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 15న పట్టణంలోని మెడికల్ హాలులో ఉదయం 11 గంటలకు కాపు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని కాపు వర్గీయులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడారు.

చాకలికుంట తండాలో ఉచిత వైద్య శిబిరం



రొంపిచర్ల : కొత్తపల్లి గ్రామంలో ఆదివారం నరసరావుపేటకు చెందిన మ్యాక్స్‌కేర్ సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ యనమదల శివప్రదీప్, డాక్టర్ యనమదల శ్రీ హర్ష పాల్గొని వైద్యసేవలు అందించారు. గ్రామానికి చెందిన 300 మందికి జ్వరం, జలుబు, దగ్గు, బీపీ, షుగర్ వంటి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బికారి నాయక్, ఎంపీటీసీ సోమ్లా నాయక్, ఉప సర్పంచ్ నరసింహా నాయక్, ఆర్ఎంపీ వైద్యులు కొడావత్ నరసింహా నాయక్ పాల్గొన్నారు.